సాక్షి
తిరుపతి
ఆదివారం । 4 । ఫిబ్రవరి । 2024



మెరుగైన వైద్యమే లక్ష్యం

పేద రోగులకు మెరుగైన వైద్యమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకెళ్తోందని కలెక్టర్ లక్ష్మీశ స్పష్టం చేశారు. - 8లో



మోటార్ సైకిళ్ల స్వాధీనం

జిల్లాలో చోరీకి గురైన 41 మోటార్ సైకిళ్లను రేణిగుంట పోలీసులు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్పీ తెలిపారు. - 8లో



తైలాభిషేకం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని శనీశ్వర స్వామికి శనివారం ఆగమోక్తంగా తైలాభిషేకం నిర్వహించారు.

న్యూస్‌రీల్

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 7 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 58,842 మంది స్వామివారిని దర్శించుకోగా, 21,796 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.44 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

కచ్చితమైన గణాంకాలుండాలి



మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

తిరుపతి అర్బన్: ఖర్చుచేసిన ప్రతి పైసాకు సంబంధించి కచ్చితమైన గణాంకాలు ఉండాలని కలెక్టర్ జీ.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన కలెక్టరేట్‌లో గణాంకాలశాఖ అధికారులతో సమీక్షించారు. ప్రణాళిక శాఖ కీలమైందిగా వెల్లడించారు. సుస్థిర అభివృద్ధి, లక్ష్యాలు, పార్లమెంటు సభ్యుల అభివృద్ధి నిధుల పథకం, గడప గడపకు మన ప్రభుత్వం తదితర అంశాలకు సంబంధించి ప్రణాళికాశాఖ అధికారులతో సమీక్షించారు. జిల్లా ప్రణాళికా, గణాంక శాఖ అధికారి ప్రేమ్‌చంద్ర జిల్లాలో ఇప్పటి వరకు 86 శాతం గృహాల కుల గణన పూర్తయినట్టు వివరించారు. గణాంకాధికారి బాలాజీసింగ్, ఉప గణాంకాధికారులు రాజేంద్రప్రసాద్, విజయ, రాజరాజేశ్వరి పాల్గొన్నారు.

బంగారు తిరుచ్చిపై కల్యాణ వెంకన్న



చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారు శనివారం బంగారు తిరుచ్చిపై ఊరేగుతూ భక్తులను కనువిందు చేశారు. వారపు ఉత్సవాల్లో భాగంగా ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలను నిర్వహించారు. సాయంత్రం సర్వాలంకర శోభితుడైన శ్రీనివాసుడు, అమ్మవార్లతో కలిసి బంగారు తిరుచ్చిపై ఆశీనులై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు.



ఆస్థాన మండపంలోని పీఠాధిపతుల ధార్మిక సమావేశం



శ్రీదేవి భూదేవి సమేత మలయప్ప స్వామి వారికి హారతి సమర్పిస్తున్న అర్చకులు, సేవలో టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈఓ ధర్మారెడ్డి

ధార్మిక సదస్సు.. ఆధ్యాత్మిక ఉషస్సు

తిరుమలలో శనివారం జరిగిన ధార్మిక సదస్సు భక్తుల్లో నూతనోత్సాహాన్ని నింపింది. స్వామీజీల అనుగ్రహ భాషణం టీటీడీకి దిక్సూచిలా మారింది. సనాతన ధర్మం యువతను సన్మార్గం వైపు నడపాలని సూచించింది. హిందూ ధర్మప్రచార వ్యాప్తికి దిశానిర్దేశం చేసింది. భవిష్యత్‌లో మరిన్ని ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టే విధంగా ప్రణాళికలు రచించింది. దీనిపై సర్వత్రాహర్షం వ్యక్తమవుతోంది.

ఏడు కొండలవాడి చెంత మార్మోగిన వేద ఘోష

- హిందూ సనాతన ధర్మ పరిరక్షణకు టీటీడీ సేవలు అభినందనీయం
- అనుగ్రహభాషణంలో స్వామీజీల ఉద్ఘాటన

తిరుమల: తిరుమల శ్రీవారి ఆస్థాన మండపంలో టీటీడీ నిర్వహిస్తున్న మూడు రోజుల ధార్మిక సదస్సులో మొదటి రోజైన శనివారం పలు ప్రాంతాల నుంచి 25 మంది స్వామీజీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామీజీలు అనుగ్రహ భాషణం చేస్తూ సనాతన హైందవ ధర్మ పరిరక్షణలో టీటీడీ ముందంజలో ఉందని, భవిష్యత్తులోనూ దీన్ని కొనసాగిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

అభినందిస్తున్నా

శుశ్రుతానంద మాతాజీ మాట్లాడుతూ సనాతన హిందూ ధర్మప్రచారం కోసం మరిన్ని ధార్మిక కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లేందుకు టీటీడీ చైర్మన్, ఈవోల నిబద్ధత, అంకితభావాన్ని అభినందిస్తున్నాం. ఈ కార్యక్రమాలు ప్రతి మూలకు చేరుకోవాలని ఆకాంక్షిస్తున్నా.

ధార్మిక ఉత్సాహం

స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామి మాట్లాడుతూ టీటీడీ కార్యక్రమాలు యువతలో ధార్మిక ఉత్సాహాన్ని నింపి సన్మార్గం వైపు నడిపిస్తున్నాయన్నారు. సామాజిక మాధ్యమాల్లో టీటీడీపై వస్తున్న అవాస్తవాలతో కూడిన విమర్శలను ఎస్వీబీసీ ధార్మిక కార్యక్రమాల ద్వారా టీటీడీ విజయవంతంగా తిప్పి కొడుతోందని తెలిపారు. గోసంరక్షణ కార్యక్రమాలు చక్కగా ఉన్నాయని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా తన అధికారిక నివాసంలో గోశాలను నిర్మించడం అభినందనీయమని వెల్లడించారు. ధార్మిక కార్యక్రమాలకు కూడా టీటీడీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను వినియోగించాలని సూచించారు

హిందూ ధర్మపరిరక్షణలో టీటీడీ ముందంజ

విద్యాశ్రీశతీర్థ స్వామి మాట్లాడుతూ సనాతన హిందూ ధర్మ పరిరక్షణ, వ్యాప్తిలో టీటీడీ దేశంలోనే ముందుంది. టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డిని అభినందిస్తున్నా. హిందూధర్మ ప్రచారానికి ఆయన గతంలోను, ప్రస్తుతం అంకితభావంతో సేవలందిస్తున్నారు. అదేవిధంగా అఖండ సుందరకాండ, గీతాపారాయణం మొదలైన పారాయణాలతో యువతలో భక్తిని పునరుజ్జీవింపజేసేందుకు టీటీడీ ఈవో ఏవీ.ధర్మారెడ్డి కృషి చేస్తున్నారు.

ధ్యాన మందిరాలు ఏర్పాటు చేయాలి

దేవనాథ రామానుజ జీయర్ స్వామీజీ మాట్లాడుతూ.. తిరుమల దివ్యక్షేత్రంలో ధ్యాన మందిరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఎస్వీబీసీ యూట్యూబ్ చానల్ ద్వారా ధార్మిక కార్యక్రమాలను సమాజంలోకి తీసుకెళ్లాలని సూచించారు.

ధార్మిక విషయాలు జోడించాలి

శివ దర్శనం మాతాజీ మాట్లాడుతూ.. సమాజంలో శత్రుత్వాలు, ఒడిదుడుకులు ఉన్నప్పటికీ ప్రతిఒక్కరిలో సనాతన హిందూ భావాలను బయటకు తీసుకురావడానికి ధార్మిక కార్యక్రమాలు చాలా అవసరం. పాఠశాల, కళాశాల స్థాయిలో సిలబస్‌లో ధార్మిక విషయాలను జోడించాలి. గతంలో శుభప్రదం నిర్వహించేవారు. విద్యార్థుల్లో ఆధ్యాత్మిక భావాలను పెంపొందించేందుకు దీన్ని పునఃప్రారంభించాలి.

శ్రీవారి సేవా కార్యక్రమాల్లో విద్యార్థులను భాగస్వాములను చేయాలన్నారు. స్వరూపానందగిరి స్వామి మాట్లాడుతూ తిరుమల తరహాలో గోవింద నామ స్మరణను తిరుపతి, శ్రీనివాస మంగాపురం, తిరుచానూరు, రేణిగుంట, చంద్రగిరి ప్రాంతాల్లో వినిపించాలని సూచించారు.

ద్రవిడ వేదాన్ని ప్రోత్సహించాలి

రామచంద్ర రామానుజ జీయర్ మాట్లాడుతూ టీటీడీ ద్రావిడ వేదాన్ని కూడా ప్రోత్సహించాలన్నారు. విశ్వయోగి విశ్వంజీ మాట్లాడుతూ తిరుమల నుంచి సనాతన ధర్మ విశిష్టతను ప్రపంచానికి చాటేలా టీటీడీ కార్యక్రమాలు నిర్వహిస్తోందని కొనియాడారు.



విద్యుద్దీపాలతో స్వామివారి వజ్ర కిరీటం



పూల అలంకరణలో స్వామివారి రూపాలు



గజరాజు, అశ్వాల ప్రతిమలు



లేగ దూడతో గోమాత బొమ్మ

అందరూ శ్రీవారి భక్తులే

- శ్రీవారి సేవకు ముందుకు వచ్చిన వారికి ప్రశంసలు
- హైందవ ధర్మంలో ఇలాంటి వాటిని ప్రోత్సహించాలి
- టీటీడీ ధార్మిక సదస్సులో మహాసాధ్వి రమ్యానంద భారతి



మాట్లాడుతున్న మహాసాధ్వి రమ్యానంద భారతి

తిరుమల: అన్ని మతాల వారు తిరుమల శ్రీవారికి భక్తులేనని మహాసాధ్వి రమ్యానంద భారతి స్పష్టం చేశారు. టీటీడీ ధార్మిక సదస్సులో శనివారం ఆమె ఈ మేరకు అనుగ్రహ భాషణం చేస్తూ టీటీడీ డయల్ యువర్ ఈఓ కార్యక్రమానికి ఓ ముస్లిం భక్తుడు కాల్ చేసి శ్రీవారి సేవ చేసేందుకు మాక్కూడా అవకాశం కల్పించండి అని అడగడం ప్రశంసనీయమన్నారు. హైందవ ధర్మంలో భాగంగా ఇలాంటి వాటిని ప్రోత్సహించాలని సూచించారు. మరో ముస్లిం భక్తుడు స్వామివారికి వారం వారం నిర్వహించే అష్టదళ పాదపద్మారాధన సేవకు 108 బంగారు పుష్పాలను సమర్పించడం శుభపరిణామమన్నారు. ఇలాంటి ధార్మిక కార్యక్రమాలను ప్రోత్సహించాలని సూచించారు.

ఆ నేతపై భగ్గుమన్న హిందువులు

శ్రీవారి సేవ కోసం ముస్లింలు ముందుకొస్తే అదేదో పెద్ద నేరంగా అభివర్ణించిన బీజేపీ నేత భానుప్రకాష్ రెడ్డి వ్యాఖ్యలను పలువురు హిందువులు, శ్రీవారి భక్తులు తప్పుబట్టారు. టీటీడీ యాక్ట్‌లో అన్యమతస్తులైనా సరే శ్రీవారిపై విశ్వాసం ఉంటే వారికి స్వామివారి దర్శన భాగ్యం కల్పించవచ్చని ఉందని, ఇలాంటి నిబంధనలను పక్కనపెట్టి ముస్లిం భక్తులను అడ్డుకోవడం సముచితం కాదని హెచ్చరించారు. శ్రీవారికి ముస్లిం భక్తులతో ఉన్న అనుబంధం ఆయనకు తెలియదేమో అని హేళన చేశారు. బీబీ నాంచారమ్మ స్వామి వారిని తన భర్తగా భావించి పూజలు చేశారని గుర్తుచేశారు. అన్నమయ్య తన సంకీర్తనతో తూతుకూడి నాంచారి అంటూ స్తుతించారని చెప్పారు. బీబీ నాంచారమ్మ భక్తిని మెచ్చి స్వామి వారు తిరుమలకు వచ్చే వారంతా నావారు, వెళ్లే వారంతా నీవారని వరమిచ్చారన్నారు. దీని కారణంగానే భక్తులు తలనీలాలు సమర్పించే సంప్రదాయం తిరుమలలో మొదలైందని గుర్తుచేసుకోవాలన్నారు. స్వామివారికి నిత్యం అలంకరించే ఆభరణాలలో 50 కోట్లకు పైగా విలువ చేసే ఒకటైన కాసుల హారాన్ని సమర్పించింది కూడా ముస్లిం భక్తులేనని తెలిపారు. అదేవిధంగా అయోధ్య రామమందిర ప్రారంభోత్సవానికి ముస్లిం భక్తులను ట్రస్టు ద్వారా ఆహ్వానించిన విషయాన్ని వారు గుర్తుచేశారు.

అప్పుడు అడ్డురాలేదా?

టీటీడీ పాలక మండలి సభ్యులుగా పనిచేసిన భానుప్రకాష్‌రెడ్డి తన హయాంలో టీటీడీలో ఉన్న అన్యమత ఉద్యోగులను ఎందుకు తొలగించలేకపోయారని నిలదీస్తున్నారు. అయోధ్యకు ముస్లిం భక్తులు వెళ్తే అద్భుతం.. తిరుమలకు ముస్లిం భక్తులు వస్తే నేరమా..? అని ప్రశ్నించారు. ఈ సంస్కృతి ఎందులో ఉందో చెప్పాలన్నారు. స్వలాభం కోసం టీటీడీపై ఆరోపణలు చేయడం భావ్యం కాదని హితవు పలికారు.

రేపటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

తిరుపతి ఎడ్యుకేషన్ : ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సర జనరల్, ఒకేషనల్ విద్యార్థులకు ఈ నెల 5 నుంచి 20వ తేదీ వరకు ప్రాక్టికల్స్ పరీక్షలను నిర్వహించనున్నారు. 5 నుంచి 15వ తేదీ వరకు ఒకేషనల్ విద్యార్థులకు మూడు స్పెల్స్‌ల్లో, 11 నుంచి 20వ తేదీ వరకు రెండు స్పెల్స్‌ల్లో జనరల్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రాక్టికల్స్ నిర్వహణకు తిరుపతి జిల్లా వ్యాప్తంగా 138 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఐదు స్పెల్స్‌ల్లో జనరల్, ఒకేషనల్ కలిపి మొత్తం 22,454 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారు. పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లను పూర్తిచేశారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎంపీ గురుమూర్తి, నూకతోటి రాజేష్

తిరుపతి మంగళం: తిరుపతి పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలో అనారోగ్యం బారినపడి చికిత్స పొందిన వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా తిరుపతి ఎంపీ గురుమూర్తి, సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ శనివారం లబ్ధిదారులకు అందజేశారు. తిరుపతిలో జరిగిన ఈ కార్యక్రమంలో సత్యవేడు నియోజకవర్గం, పెద్దఈటిపాకం గ్రామానికి చెందిన కె.రవికి రూ.2 లక్షలు, కేవీబీపురానికి చెందిన కె.సుబ్రహ్మణ్యంకి రూ.1.3 లక్షలు, కనమనంబేడుకు చెందిన వై.రామచంద్రనాయుడుకి రూ.8 లక్షలు, వరదయ్యపాళెం మండలం, గంగమిట్టకి చెందిన మంజులకు రూ 1.1 లక్ష, అల్లప్పగుంటకు చెందిన చల్లా నాగయ్యకి రూ.2.3 లక్షలు, సూళ్లూరుపేట నియోజకవర్గం, తడకు చెందిన బి.దొరబాబుకి రూ.2.7 లక్షలు, వెంకటగిరి నియోజకవర్గానికి చెందిన వి.వినయ్‌కి రూ.1.3 లక్షలు, శ్రీకాళహస్తి నియోజకవర్గం, పొంగూరుకి చెందిన జి.రామచంద్రారెడ్డికి రూ.60 వేలు చొప్పున మొత్తం 19 లక్షల మూడు వేల రూపాయల విలువగల చెక్కులను అందజేశారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రూ.25 లక్షల వరకు ఉచిత ఆరోగ్య సేవలు పొందేవిధంగా పరిమితిని పెంచడం గొప్ప విషయమన్నారు. ఆరోగ్యశ్రీ వర్తించని వారికి కూడా ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఆర్థిక సహాయం అందిస్తున్నట్టు గుర్తుచేశారు. రాష్ట్ర ప్రజల మన్ననలు చూరగొన్న ముఖ్యమంత్రి జగనన్నని మరోసారి ఆశీర్వదించాలని ఆయన కోరారు.

భవనాల పరిశీలన

తిరుపతి అర్బన్: 2024 ఎన్నికల నేపథ్యంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లకు సంబంధించిన ఈవీఎంలను భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూంతోపాటు కౌంటింగ్ కేంద్రాల కోసం భవనాలను కలెక్టర్ జీ.లక్ష్మీశ పరిశీలించారు. శనివారం ఆయన తిరుపతి ఎస్వీ యూనివర్సిటీకి చెందిన పలు భవనాలను, కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, ఎస్వీ వెటర్నరీ, ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయం, ఎస్వీ అగ్రికల్చర్ కాలేజ్ తదితర భవనాలను పరిశీలించారు. అనంతరం ఎస్వీయూ వైస్ చాన్సలర్ వీ.శ్రీకాంత్‌రెడ్డితో సమావేశమయ్యారు. ఆయనతోపాటు జేసీ శుభం భన్సల్ తదితరులు ఉన్నారు.



ఎస్వీయూ భవనాలను పరిశీలిస్తున్న కలెక్టర్, జేసీ, డీఆర్వో

మద్యం బాటిళ్లు స్వాధీనం

ఏర్పేడు: మండలంలోని గుండ్లకండ్రిగలో అక్రమంగా విక్రయిస్తున్న మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఏర్పేడు సీఐ శ్రీరామ శ్రీనివాసులు తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు గుండ్లకండ్రిగ గ్రామంలోని మునస్వామి చిల్లర దుకాణంలో సోదాలు నిర్వహించగా.. 10 మద్యం బాటిళ్లు గుర్తించి స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు సీఐ చెప్పారు.

విద్యార్థిని అదృశ్యంపై ఫిర్యాదు



సురేఖ (ఫైల్)

ఏర్పేడు: మండలంలోని పాతవీరాపురంలో విద్యార్థిని అదృశ్యంపై శనివారం ఫిర్యాదు అందినట్టు ఏర్పేడు సీఐ శ్రీరామ శ్రీనివాసులు చెప్పారు. పాతవీరాపురం గ్రామానికి చెందిన చిన్నరెడ్డెప్ప కుమార్తె సురేఖ (17) తిరుపతిలోని ఓ ప్రైవేట్ కళాశాలలో చదువుతోంది. శుక్రవారం కళాశాలకు వెళ్లిన సురేఖ సాయంత్రం ఇంటికి రాలేదన్నారు. బంధువులు ఇళ్ల వద్ద వెదికినా ఆచూకీ తెలియకపోవడంతో విద్యార్థిని తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు సీఐ తెలిపారు.

వైఎస్సార్‌సీపీకి ఐటీ వింగ్ గుండెలాంటిది

- ఐటీ విభాగం పోస్టర్ల ఆవిష్కరణలో తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: వైఎస్సార్‌సీపీకి ఐటీ వింగ్ గుండెలాంటిదని తుడా చైర్మన్, వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఐటీ ఆర్మీ ఆధ్వర్యంలో నూతనంగా రూపొందించిన పోస్టర్లను శనివారం తుమ్మలగుంటలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ రాజకీయ పార్టీలకు ఐటీ విభాగం వెన్నెముకలాంటిదన్నారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగ సంక్షేమ పథకాలను గడప గడపకూ చేర్చడంలో వలంటీర్ వ్యవస్థతో పాటు ఐటీ విభాగం కూడా కీలకంగా ఉందన్నారు. చేసిన మంచిని పది మందికీ చెప్పే గురుతర బాధ్యతను భుజాన వేసుకుని వంద శాతం సక్సెస్ అయిన ఐటీ విభాగానికి అభినందనలు తెలిపారు. అనంతరం ఐటీ విభాగం పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో తిరుపతి జిల్లా ఐటీ విభాగ ప్రెసిడెంట్ రాచపల్లి మదన్‌మోహన్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ దూది సుధీర్ (చింటు), సెక్రటరీ రెడ్డిచెర్ల నరేష్ బాబు, బెంగళూరు ఐటీ విభాగ సభ్యులు పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్యమే లక్ష్యం



వైద్యాధికారులు, వివిధ విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న జిల్లా కలెక్టర్



తిరుపతి రుయా ఆస్పత్రిలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

తిరుపతి తుడా: పేదలకు మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి ప్రాధాన్యత ఇస్తోందని కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన రుయా ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం వైద్యాధికారులు, వివిధ ఆస్పత్రుల హెచ్‌ఓడీలు, వివిధ విభాగాల అధిపతులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆస్పత్రుల నిర్వహణ, రోగులకు అందుతున్న వైద్య సేవలు, సదుపాయాలపై కలెక్టర్ ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేదలందరికీ ఆధునిక వైద్యాన్ని ఉచితంగా అందించేందుకు ప్రభుత్వం పెద్ద ఎత్తున ఖర్చు చేస్తోందన్నారు. ఇందుకు అనుగుణంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆధునిక వైద్య పరికరాలు, వైద్యులు, వైద్య సిబ్బంది నియాకమాలు పూర్తి స్థాయిలో సమకూర్చినట్టు తెలిపారు. అనారోగ్యంతో వచ్చే ఏ ఒక్కరూ మంచి వైద్యం అందలేదనే అసంతృప్తితో వెళ్లకూడదని చెప్పారు. సమావేశానికి ముందు ఆస్పత్రిలోని ఎమర్జెన్సీ, క్యాజువాల్టీ, ఐసీయూ, స్పెషాలిటీ వార్డులను కలెక్టర్ పరిశీలించారు. టాయ్‌లెట్స్ శుభ్రతను పరిశీలించి శానిటేషన్ మెరుగుపడాలని సూచించారు. రుయా ఆస్పత్రిలోని ప్రభుత్వ సీటీ స్కాన్ విభాగాన్ని పరిశీలించారు. ఆయన వెంట డీఎంహెచ్‌ఓ శ్రీహరి, రుయా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవిప్రభు, ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖరన్, ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పార్థసారథి, స్విమ్స్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్, డీసీహెచ్‌ఎస్ ఆనందమూర్తి, ఈఎస్‌ఐ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్, జిల్లా ఆరోగ్యశ్రీ సమన్వయ కర్త డాక్టర్ రాజశేఖర్, జగనన్న ఆరోగ్య సురక్ష నోడల్ అధికారి తేజేశ్వని పాల్గొన్నారు.

భారీగా మోటార్ సైకిళ్ల స్వాధీనం

- ముగ్గురు అంతర్రాష్ట్ర బైక్‌దొంగల అరెస్ట్



స్వాధీనం చేసుకున్న బైక్‌లను పరిశీలిస్తున్న ఎస్పీ

రేణిగుంట: భారీగా చోరీకి గురైన మోటార్ సైకిళ్లను రేణిగుంట పోలీసులు స్వాధీనం చేసుకుని, ముగ్గురు అంతర్రాష్ట్ర బైక్ దొంగల ముఠాను అరెస్ట్ చేసినట్టు ఎస్పీ పరమేశ్వరరెడ్డి తెలిపారు. స్థానిక అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ రేణిగుంట డీఎస్పీ భవ్యకిషోర్ పర్యవేక్షణలో రేణిగుంట పోలీసులు ప్రత్యేక నిఘా బృందం ఏర్పడి బైక్ దొంగల ముఠా ఆటకట్టించారన్నారు. బైక్ పార్కింగ్, యాత్రికులు రద్దీగా ఉన్న ప్రదేశాలలో నిఘా పెట్టి అనుమానితుల కదలికలను గమనించి చాకచక్యంగా ముగ్గురు అంతర్రాష్ట్ర నిందితులను పట్టుకున్నట్లు వెల్లడించారు. అరెస్ట్ అయిన వారిలో అన్నమయ్య జిల్లా, రైల్వే కోడూరు, అంతరాజుపేటకు చెందిన కలిశెట్టి సుబ్రమణ్యం అలియాస్ మణి (43), ఎంజీ రోడ్డుకు చెందిన గిద్దలూరు సుబ్రమణ్యం(45), తమిళనాడు రాష్ట్రం తిరువళ్లూరు జిల్లా మన్నూరు పెట్టైకు చెందిన సయ్యద్ అబ్దుల్ కరీం (38) ఉన్నట్టు తెలిపారు. వీరిని రేణిగుంట వేణుగోపాలపురం సమీపంలో అరెస్ట్ చేసినట్లు వివరించారు. వారి నుంచి రూ.21.15 లక్షల విలువైన 41 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్టు పేర్కొన్నారు. నిందితుల్లో కోడూరుకు చెందిన కలిశెట్టి సుబ్రమణ్యం, గిద్దలూరు సుబ్రమణ్యంపై 19 కేసులు, తమిళనాడుకు చెందిన సయ్యద్ అబ్దుల్ కరీంపై 50 కేసులు ఉన్నట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలలో రేణిగుంట అర్బన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 13, తిరుపతి ఈస్ట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో11, అలిపిరి పోలీస్ స్టేషన్ పరిధిలో 12, రైల్వే కోడూరు పోలీస్ స్టేషన్ పరిధిలో 5 ద్విచక్ర వాహనాలున్నట్లు వివరించారు. రేణిగుంట డీఎస్పీ భవ్యకిషోర్, సీఐ సుబ్బారెడ్డి, ఐడీ పార్టీ సిబ్బంది సోమశేఖర్, భారూషా, సూర్యనారాయణ, శ్రీను, రమేష్, గౌరినాయుడు, మునికృష్ణ, మణి, రాజశేఖర్, జిలానీపీర, యూసుఫ్ బాషా, శ్రీనివాసులు, గురవయ్య, చిరంజీవులు, కృష్ణమూర్తి, వెంకటరమణకు ఎస్పీ రివార్డులు అందంజేశారు.

కొత్త తహసీల్దార్ల నియామకం

తిరుపతి అర్బన్: జిల్లాలో 34 మండలాలకు గాను 29 మండలాలకు కొత్త తహసీల్దార్లను నియమిస్తూ కలెక్టర్ లక్ష్మీశ శనివారం ఉత్తర్వులు విడుదల చేశారు. వీరంతా సోమవారం నుంచి తమకు కేటాయించిన మండలాల్లో బాధ్యతలు స్వీకరించనున్నారు. అయితే ఈ ఏడాది జూన్‌లో ఉద్యోగ విరమణ పొందనున్న తహసీల్దార్లుకు బదిలీల నుంచి మినహాయింపు ఇచ్చారు. వారిని కలెక్టరేట్ కార్యాలయంలో వివిధ విభాగాలకు సూపరింటెండెంట్‌లుగా నియమించారు. కొత్తగా బాధ్యతలు చేపట్టనున్న తహసీల్దార్లలో తిరుపతి అర్బన్-ఏ.నాగేశ్వరరావు, వెంకటగిరి- కే.సాంబశివరావు, ఓజిలి-జీ.నాంచారయ్య, చిట్టమూరు-కే.శ్రీనివాసశర్మ, సూళ్లూరుపేట-కే. కళ్యాణి, దక్కిలి- జీ.శ్రీనివాస్, దొరవారిసత్రం- బీవీఆర్‌సీహెచ్ ప్రసాద్, కోట- డీ.నాగేశ్వరావు, గూడూరు- జీ.కరుణాకుమార్, బాలయపల్లి-కే.పుల్లారావు, వాకాడు-ఎస్. వెంకటనరసింహారావు, పెళ్లకూరు-కేవీఆర్‌వీ ప్రసాద్‌రావు, బీఎన్‌కండ్రి-ఎం. బాలకిషన్, ఆర్‌సీపురం- పీ.ఉషారాణి, చంద్రగిరి- జీ.మారుతి, పాకాల-డీ.వాణిశ్రీ, చిన్నగొట్టిగల్లు- జీ.నాగరాజు, పుత్తూరు-కే.శ్రీనివాసగౌడ్, పిచ్చాటూరు-డీ.హుసేన్‌సాహెబ్, సత్యవేడు- కే.రామాంజనేయులు, వడమాలపేట-వీ.రాజసింహ, ఏర్పేడు-డి.ఉదయభాస్కర్‌రాజు, నారాయణవనం-పీ.శంకరరావు, రేణిగుంట-ఎంపీఎస్ నారాయణరెడ్డి, వరదయ్యపాళెం-వై. ఉదయభారతి, కేవీబీపుర- ఎం.శ్రీరాములునాయక్, నాగలాపురం-సీ.నరసింహులు, తిరుపతి రూరల్-ఎస్.మహబూబాచంద్ శ్రీకాళహస్తి- కే.జనార్దన్‌రాజు ఉన్నారు. అలాగే ఎస్.ద్వారకానాథ్‌రెడ్డి-స్పెషల్ తహసీల్దార్, కలెక్టరేట్, బీ.శ్రీధర్‌రావు- స్పెషల్ తహసీల్దార్, ఆర్‌జేసీ, దేవదాయశాఖ, పీ.శరత్-ఆర్డీవో కార్యాలయం, శ్రీకాళహస్తి , తిరుపతి-కే.నరసింహారావు, కలెక్టర్ ఆఫీస్ ఉన్నారు.